# కొద్ది కథలు

## సమయస్ఫూర్తి

ఒకానొక నవాబుగారిదగ్గర ఒకతెలివైన మంత్రి వుండేవాడు. నవాబుగారు అన్న ప్రతీమాటనీ మంత్రి నిజమేనని సమర్థించి బహుమానం పొందుతూ వుండేవాడు. నవాబుగారికి ఛలోక్తులు అంటే యెక్కువ యిష్టం. మంత్రికి సమయస్ఫూర్తిగా మాట్లాడడం అలవాటు.

నవాబుగారికి వంకాయ కూరంటే ఎంతో ప్రీతి. ఒకరోజున నవాబుగారు మంత్రితో "మంత్రీసాహెబ్, ఈ ప్రపంచం హంతలోనూహున్న కూరగాయల్లో వంకాయ రాజుకూరహండీ" అన్నాడు.

మంత్రి తడుముకోకుండా "చిత్తం సర్కార్! మీరు చెప్పినమాట నిజం. అది కూరలన్నింటిలోను రాజు కాబట్టే దానికి 'అల్లా' నెత్తిమీద కిరీటం(ముచికి) పెట్టాడు" అన్నాడు.

ఇలా కొన్నిరోజులు గడిచాయి.

నవాబుగారు వంకాయకూరకి అలవాటుపడి రోజూ ఆ కూరే తినడం ప్రారంభించాడు. దాంతో ఆయనికి వేడి జాస్తియై ఒళ్లంతా దురదలు ప్రారంభించింది. మళ్ళీ నవాబుగారు, మంత్రిగారు కులాసాగా కబుర్లు చెప్పుకునే సమయంలో నవాబుగారు "దివాన్‌జీ! వంకాయావుందీ సూశారూ అది హెథవకూర. దానిహంత హెథవకూర యేదీ లేదు. అదీ మూాకే బహుత్ అపకారం సేసింది" అన్నాడు.

మంత్రి వెంటనే "నిజం హుజూర్! మీరు సత్యం పలికారు. దానంత ఛండాలంకూర మరొకటి లేదు. అది శరీరానికి చాలాఅనారోగ్యకరం. కాబట్టే భగవంతుడు దానికి నెత్తిమీద 'గసిగి' కొట్టాడు" (ముచికి) అన్నాడు.

నవాబుగారు మంత్రి సమయస్ఫూర్తికి సంతోషించాడు నవాబు!

కాకరపర్తి కామేశ్వర శాస్త్రి.

* * *

## రూలు రూలే!

అప్పుడే విజయనగరం స్టేషన్‌లో రైలు ఆగింది. ప్రయాణీకులు వెళ్ళుతున్నారు, వస్తున్నారు. 15 నిముషాల సేపు ఇట్లు జరిగింది. రెండు బెల్లులు అయేయి. సిగ్నల్ వాలింది. ఇంతలో ఒకరైతు 'క్యూ' అనే మహాసముద్రం నుండి బయటపడి ప్లాట్‌ఫారం ఉరుకు పరుగులతో చేరుకున్నాడు. రైలు స్టేషన్ వదిలింది. రైతు రైలు ఎక్కుతున్నాడు. హఠాత్తుగా గార్డువచ్చి రెక్కపట్టుకు దింపేసి అలా ఎక్కకూడదు రూల్సు అన్నాడు. ఇంతలోకి గార్డు పెట్టె వచ్చింది, గార్డు ఎక్కేడు. వెంటనే రైతు గార్డుని రెక్కపట్టుకు దింపేడు. గార్డు ఏమి ఇలా చేసేవంటే రైతు "బాబు తమరేకదా! రైలు నడుస్తున్నప్పుడు ఎక్కకూడదన్నారు. మరి రూలు రూలేకదా!" అన్నాడు. గార్డు తెల్లమొహం వేసాడు.

ఎమ్. ఎస్. ఆర్. కె. శాస్త్రి.

## దెబ్బకు దెబ్బ

రాత్రి 9 గంటలకు "టి"కని రంగ, నేనూ సినిమాహాలుకు వెళ్లి, పల్లెగాని ఆపల్లెటూర్లో, డబ్బాకొట్టుదగ్గరనుంచొని మాట్లాడుతూ రెండు "టీ"లు ఇవ్వమన్నాం. ప్రక్కనున్న పల్లెటూరిపగలా పుక్కిలించి వూస్తున్నాడు కాబోలు, నీళ్ళు, అవి మావాడిమీద పడటంవల్ల "మేష్టారూ! కొంచెం అటు వూయండి, మీద పడుతున్నా" యని వినయంగా చెప్పాడు. ఆదోరకంమనిషి అవటంవల్ల అతడు "అయితే, అటు తప్పుకోండి" అని కఠోరంగా మేము నుంచోవలసిన స్థలాన్ని చూపుతూ చెప్పాడు. కను సైగతో నన్ను మాట్లాడకుండా మావాడు అదమాయించి "టీ" త్వరగా త్రాగుతున్నాడు.

వాడూ, త్రాగుతున్నాడు "టీ" త్రాగేసిన మావాడు, నోటిలో సిగరెట్టు పెట్టి, నిప్పుకు అని ఇనపపొయ్యిదగ్గర కెళ్ళి, కెలకటం ప్రారంభించాడు. ఖర్మంకాలి వాడూ అక్కడే నుంచొని ఉండటంవల్ల, హృదయపూర్వకంగా చేసే మావాడి పనివల్ల రవ్వలు మీద పడసాగినై. కొంచెం కోపంతో వాడు "రవ్వలు మీద పడుతున్నాయని" హెచ్చరించాడు మావాడిని. "అయితే అటు తప్పుకోండి" అని దెబ్బకుదెబ్బ కొట్టినందుకు కులుకుతూ సిగరెట్టు అంటించి "పదరా" అని అడుగు ముందువేశాడు.

సింగంశెట్టి జగన్మోహనరావు.